క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మావులూరి విశ్వనాథ్

రాయచోటి అర్బన్ : ఉపాధి హామీ పథకం పనులలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నేత మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయచోటి మండలంలోని యండపల్లె, మాధవరం గ్రామాల్లో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్నారు. పనులు చేపట్టకుండానే దొంగ బిల్లులు పెట్టకుండా ఉపాధి హామీ నిధులు లక్షలలో స్వాహా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోకుంటే లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామంటూ ఆయన హెచ్చరించారు. సమావేశంలో లిబరేషన్ నేతలు రమణ, సుబ్బమ్మ, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్ ఏర్పాటు



వాటర్ ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కాలప్పగుడి ఆవరణలో ప్రజల అవసరాల నిమిత్తం పరిసరాలలో ఉన్న బ్యాంకు, ఇతరాత్ర పనులకు వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు శుక్రవారం కుర్రామణి యాదవ్, సామల రామచంద్రయ్య, వీరబల్లి జయకుమార్ రెడ్డిల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సూర్యనారాయణ హాజరై దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మోడపోతుల రాము, శ్యామన బోయిన గురుప్రసాద్, కొత్తపల్లి రాజాచారి, కానకుర్తి వెంకటయ్య, గాడి సునీల్ రెడ్డి, ఆంజనేయులు, రిటైర్డ్ ఎంఆర్‌ఓ జయన్న, గొబ్బిళ్ల మణి, గుండు సురేష్, కిరణ్, శ్రీరామ, హరినాథ్, మట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలను నమ్మని రాజంపేట ప్రజలు

రాజంపేట టౌన్ : ఎన్నికల సందర్భంగా చంద్రబాబునాయుడు రాజంపేట పర్యటనలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను ఓటర్లు నమ్మలేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా ఇన్‌ఛార్జ్ మిర్యాల సురేఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను ఎప్పుడూ నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. బాబు హామీలు నమ్మకుండా రాజంపేట ఎమ్మెల్యేగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని, ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను గెలిపించిన ప్రజలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అధికారం లేకపోయినా ఎప్పటిలాగే ప్రజాసమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ తరఫున పనిచేస్తామని తెలియజేశారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరు గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరణ చేశారు. భక్తులు ఉదయాన్నే గంగమ్మకు కుంకుమార్చనలు, అలాగే రాహుకాల పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు



ప్రిన్సిపల్ హర్షలతా పంకజ్

రాయచోటి రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ సంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హర్షలతా పంకజ్ తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బాటనీ, బీఏ హిస్టరీ, ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఏ ఉర్దూ మీడియం గ్రూపులు ఉన్నాయన్నారు. ఈ కోర్సుల ప్రవేశానికి ఈ నెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. చేరదలచిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా లేదా కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపల్ తెలియజేశారు.

బీడుబారిన చెరువులు.. నైరుతిపైనే ఆశలు

- లేకుంటే భారంగానే ఖరీఫ్ సాగు
- నైరుతి రుతుపవనాల వర్షాలతోనే భూగర్భ జలాల పెరుగుదల
- ఆరుద్ర కార్తికు సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు



నీరులేక దర్శనమిస్తున్న రాజంపేట మండలంలోని పోలి చెరువు

రాజంపేట టౌన్ : రాష్ట్రంలో నైరుతి ప్రవేశించి అనేక ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో సైతం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి చెరువుల్లోకి సైతం ఓ మోస్తారు నీళ్లు చేరాయి. అయితే రాజంపేట మండలంలో నైరుతి ప్రభావం ఏమాత్రం లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మృగశిర కార్తి శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ కార్తి నాటికి ఓ మోస్తారు వర్షాలు కురిసి ఉండాలి. అయితే కనీసం భూమి తడిచేతంటి వర్షం కూడా కురవకపోవడం, మరో రెండు వారాల్లో ఆరుద్ర కార్తి కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో ఖరీఫ్ సాగు ఎలా అని రైతన్నలు ఆలోచనలో పడ్డారు. కాగా 2021వ సంవత్సరం నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పోలి చెరువు, కృష్ణమ్మ, ఆకేపాడు, మన్నూరు, ఊటుకూరు, హస్తవరం తాళ్లపాక చెరువులు నిండి అలుగులు పారాయి. అయితే గత రెండు సంవత్సరాలుగా సరైన వర్షాలు కురవకపోవడంతో మండలంలో ఏ చెరువూ నిండలేదు. ఈ కారణంగా మండలంలోని అన్ని చెరువులు ఎండిపోయాయి. మండలంలో అతిపెద్ద చెరువు పోలి చెరువు. ఈ చెరువు నిండి అలుగు పార్లితే దాదాపు రెండు సంవత్సరాలపాటు రాజంపేట పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉంటాయి. ఈ కారణంగా ప్రజలకు తాగునీటికి, రైతన్నల సాగునీటికి ఇబ్బందులు ఉండవు. చెరువులన్ని ఎండిపోవడంతో భూగర్భ జలాలు బాగా అడుగంటిపోయాయి. ప్రస్తుతం నైరుతి ప్రభావం రాజంపేట పరిసర ప్రాంతాల్లో జాడ కూడా లేకపోవడంతో అటు ప్రజలు, ఇటు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నైరుతిలో ఓ మోస్తారు వర్షాలు కురిస్తే చెరువుల్లోకి కొద్దిపాటి నీళ్లు చేరినా భూగర్భ జలం వృద్ధి చెందుతుందని, ఆ తరువాత వర్షాకాలంలో వర్షాలు కురిస్తే చెరువులు నిండుతాయని ప్రజలు, రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రానున్న రోజుల్లో అయినా రుతుపవనాల ప్రభావం వల్ల మండలంలో వర్షాలు కురిస్తేనే రైతులు మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న ఆరుద్ర కార్తిలో వరి, అరటి పంట సాగుకు సిద్ధంకాగలరు. ఆరుద్ర కార్తిలో పంటలకు తెగుళ్ల కూడా తక్కువ సోకే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. అందువల్ల నైరుతి ప్రభావం వల్ల మంచి వర్షం కురిస్తే చెరువుల్లోకి కొద్దిపాటి నీళ్లు చేరినా పంటలను సాగు చేసేందుకు వీలవుతుంది. గత రెండేళ్లుగా సరైన వర్షాలు లేని కారణంగా రైతులు చెప్పుకోదగ్గ స్థాయిలో పంటలను సాగు చేయలేకపోయారు. అయితే ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ఇప్పటికే వెల్లడించారు. అధికారులు వర్షాలు బాగా కురుస్తాయన్న మాటలు రైతులకు ఆనందం కలిగిస్తున్నప్పటికీ నైరుతి ఆశాజనకంగా లేకపోవడంతో వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

ఏమిచేయాలో పాలుపోవడం లేదు



మండలంలో నైతుతి ప్రభావం ఏమాత్రం లేదు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో కురిసే వర్షం అయినా ఇక్కడ కురవడం లేదు. నేను ఆరుద్ర కార్తిలో పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నా. అయితే వర్షం జాడ అన్నదే లేదు. ఏమిచేయాలో పాలుపోవడం లేదు.

- ఆకేపాటి కృష్ణారెడ్డి, రైతు, హస్తవరం, రాజంపేట మండలం

కడపలో దంచికొట్టిన వాన



బస్టాండ్‌లో వర్షపు నీటిలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సులు

కడప అగ్రికల్చర్ : ఉపరితల ఆవర్తనం కారణంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఉన్నట్లుండి కడప నగరంలో ఆకాశమంతా ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములతో కూడిన వాన దంచి కొట్టింది. దీంతో నగరంలోని పలు రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం వర్షపు నీటితో నిండి చెరువును తలపించింది. బస్టాండ్ సమీపంలో డ్రైనేజీ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు మురుగునీరుతో కలిసి రోడ్లపైన పారాయి. దీంతో రోడ్లపై వెళ్లే వాహనదారులు, ప్రజలు ఆ మురుగునీటితో అవస్థలు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు సమీపంలోని చేలూరు రోడ్డులో శుక్రవారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న కందుకూరుకు చెందిన అంజాద్ (40), దర్బార్ (43) గాయపడ్డారు. వెంటనే 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గ్రంథాలయంలో బహుమతుల ప్రదానోత్సవం



వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె : ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి తన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు రెడ్డిశేఖర్ తెలిపారు. శుక్రవారం సంబేపల్లె శాఖా గ్రంథాలయంలో రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపు మే 15వ తేదీ నుండి జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరంలో నిర్వహించిన ఆటల పోటీలు, వ్యాసరచనలు, పుస్తక పఠనం తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ మాట్లాడుతూ గ్రంథాలయానికి విచ్చేస్తే ప్రపంచ చరిత్ర అంతా మీకళ్ల ముందు కనిపిస్తుందన్నారు. పుస్తక పఠనంతో జ్ఞానం పెంపొంది ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చెప్పారు. సమాజానికి, తల్లిదండ్రులకు, గురువులకు, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన వారవుతారన్నారు. గ్రంథాలయం అంటే విజ్ఞాన నిలయమని, ప్రతి సంవత్సరం వేసవిలో గ్రంథాలయంలో నిర్వహించే శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయురాలు శశికళ మాట్లాడుతూ గ్రంథాలయంలో మనకు తెలియని ఎంతో జ్ఞాన సంపద ఉంటుందని, కావున ప్రతి నిత్యం పాఠ్యపుస్తకాలతోపాటు గ్రంథాలయంలోని పుస్తకాలనూ చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సహకరించండి

లక్కిరెడ్డిపల్లె : టీడీపీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సహకరించి సమస్యలు పరిష్కరించాలని మోడల్ స్కూల్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి టీడీపీ నేషనల్ పొలిటికల్ సెక్రటరీ టీజీ జనార్దన్‌ను కోరారు. శుక్రవారం విజయవాడలో టీజీ జనార్దన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు.

వర్షం రాకతో రైతుల్లో ఆనందం



దుక్కులకు సిద్ధంగా ఉన్న పొలం

పుల్లంపేట : గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు ఈ ఏడాది అధికమయ్యాయి. దీంతో కొన్ని గ్రామాలలో సాగు, తాగునీటి సైతం ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, గర్భిణులు ఎండవేడిమికి తట్టుకోలేక అవస్థలు పడ్డారు. జూన్ మాసం వచ్చేసరికి వాతావరణం చల్లబడి అడపాదడపా వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం మొదలైంది. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు దుక్కులు వేసుకునేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. తమలపాకు, అరటి, బొప్పాయి తదితర పంటలను సాగు చేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని తద్వారా సాగు, తాగునీటి కొరత తొలగిపోతుందని రైతులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వసతి గృహాల పరిశీలన

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాలను శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ రామసుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నందున పిల్లలు సక్రమంగా ఉండడం లేదని, అందుకు వేరే కొత్త బిల్డింగ్‌లోకి మార్చేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు వారు తెలియజేశారు. కొత్త మెనూతోపాటు విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి అందిస్తామని తెలిపారు. అనంతరం వసతి గృహాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు శ్రీనివాసులు, రమేష్, స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజలకు మంత్రి పదవులు కేటాయించాలి

కడప రూరల్ : రాష్ట్రంలో ఏర్పాటు కానున్న తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి మంత్రివర్గంలో బలిజలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని బలిజ సేన రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో మెజార్టీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడంలో పవన్ కల్యాణ్, బలిజలు పెద్దన్న పాత్ర పోషించారని అన్నారు. ఈ నేపథ్యంలో బలిజలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు మంత్రి పదవులను కేటాయించాలన్నారు.

పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

రాయచోటి అర్బన్ : విద్యార్థులను, వారి తల్లితండ్రులను పలు రకాలుగా దోచుకుంటున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆ సంస్థ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలోతొక్కి విద్యార్థులను పలు రకాలుగా దోచుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను పక్కకునెట్టి తాము స్వంతంగా ప్రింట్ చేసిన పాఠ్యపుస్తకాలను వేలాది రూపాయలకు విద్యార్థులకు కట్టబెడుతూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అక్రమంగా హాస్టళ్ల నిర్వహణ పేరుతో విద్యార్థులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఫీజు రెగ్యులేషన్ చట్టాన్ని కచ్చితంగా అమలుపరిచి ఈ దోపిడీని అరికట్టాలంటూ డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్యనేతలు జస్వంత్, శివనాయక్, లూయిషా, గంగారాణి, భవిత తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు



గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలంటూ ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఓబన్న

సిద్దవటం : ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె, సిద్దవటం గ్రామాలోని ప్రజలకు శుక్రవారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. గొడవలు సృష్టించవద్దన్నారు. నలుగురు గుమికూడిన చోట రాజకీయాలు మాట్లాడవద్దని అందరు సత్ ప్రవర్తనతో మెలగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సనాతన ధర్మం, ఆచారాలను పాటిద్దాం



భగవద్గీత శ్లోకాలు వల్లిస్తున్న చిన్నారి

రాజంపేట రూరల్ : ప్రతి ఒక్కరూ సనాతన ధర్మం, ఆచారాలను దినచర్యగా పాటించాలని గీతబోధ గురువులు నారాయణస్వామి, కృష్ణ ప్రభుదాసులు కోరారు. స్థానిక శ్రీ సాయి విద్యాలయ పాఠశాలలో సనాతన వాహిని ఆధ్వర్యంలో శుక్రవారం భగవద్గీతపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 40 రోజులపాటు పట్టణంలోని పలు విద్యాలయాలలో ప్రతి రోజు సాయంత్రం 1 గంటపాటు చిన్నారులకు భగవద్గీతను బోధించినట్లు తెలియజేశారు. ఎంతో ఆసక్తి కనబరిచి శ్లోకాలను నేర్చుకున్న చిన్నారులకు 20 శ్లోకాలు, 10 శ్లోకాలు, 5 శ్లోకాలు అనే విభాగాలుగా పోటీలను నిర్వహించినట్లు తెలియజేశారు. పోటీలలో మొదటి మూడు బహుమతులతోపాటు పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందించారు. అదే విధంగా ప్రతి ఒక్కరికీ బాల భక్తులు కథల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతబోధ గురువులు స్రవంతి, లక్ష్మి, కృష్ణాప్రేమమూర్తి, రమాదేవి, సంపూర్ణ, డాక్టర్ శ్రీహరి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్. బాలరాజు, కార్యదర్శి బి.పాండురంగరాజు, నిర్వాహకులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వర్రి సురేష్‌కుమార్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కరోనా సమయంలో విధులకు తీసుకున్న కార్మికులను అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు వేతనాలతో పాటు, స్వీపర్ల ఈపీఎఫ్, ఈఎస్‌ఐ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన పనిముట్లను పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేయాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యులకు ఉద్యోగంతో పాటు ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ విధానాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు నాగరాజు, వాసు, పృథ్వీరాజ్, లోకేష్, ఓబులేసు, నందు, శేఖర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన మంచాలమ్మ తిరునాల



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారి

సుండుపల్లె : మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లి గ్రామంలో వెలసిన మంచాలమ్మ తిరునాల సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఉదయాన్నే అమ్మవారికి అభిషేకాలు జరిపి విశేషంగా అలంకరించారు. నేడు శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, హోమం, పూర్ణాహుతి మొక్కుబడులలో భాగంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. రాత్రికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు, మేళతాళాలు డప్పు వాయిద్యాల మధ్య చాందినీ బండ్లు చూపరులను ఆకర్షించనున్నాయి. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని తిరునాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ప్రశాంత ఎన్నికలకు మీడియా సహకరించింది



కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

రాయచోటి టౌన్ : 2024 సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి మీడియా చాలా సహకరించిందని, మీ సహకారం మరవలేనిదని అన్నమయ్య జిల్లా కలెక్టర్ యడుంబాకు అభిషిక్త్ కిశోర్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఏపీయుడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు చాలా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చాలా శ్రమించి పని చేసిందని చెప్పారు. అలాగే మీడియా కూడా తమకు ఎంతో తోడ్పాటునిచ్చి సహకరించిందని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపులేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్, రాయలసీమ అధ్యక్షుడు నాగరాజ్‌లు కోరారు. ఈ విషయమై శుక్రవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు రాయలసీమ వ్యాప్తంగా కొన్ని కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలలు జీప్లస్-2 ఉండాల్సిన బిల్డింగ్ పర్మిషన్‌తో జీప్లస్ 5 వరకు ఏర్పాటు చేసుకుని అక్రమ సంఖ్యలో విద్యార్థుల్ని చేర్పించుకుని ఎటువంటి మౌలిక వసతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. అలాంటి పాఠశాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 శాతం సీట్లను 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇవ్వాలని జీవో ఉన్న కొన్ని కార్పోరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజుతో 3 నుంచి 5 వేలు రాబడుతున్నారన్నారు. కొన్ని స్కూల్స్ యాజమాన్యాలు కాలం చెల్లిన బస్సులను నడుపుతూ పిల్లల ప్రాణాలతో ఆడుకుంటున్నారన్నారు. వీటిన్నింటిపై విచారణ జరిగి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఎల్లమ్మ జాతర



ఆలయంలో కొలువుతీరిన ఎల్లమ్మ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రంలో కొలువైన ఎల్లమ్మ తల్లి జాతరను శని, ఆదివారాలలో నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు చెంచు సుబ్బనరసయ్య, పెంచలయ్యలు తెలిపారు. పెనగలూరులో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతుండటంతో ఆదివారం ఎల్లమ్మ జాతరను జరుపనున్నారు. శనివారం అమ్మవారికి పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రాత్రికి ఆసాదుకథ, అమ్మవారి ప్రతిమను ఆలయం ముందు వేయనున్నట్లు చెప్పారు. ఆదివారం అమ్మవారికి పొంగుబ్యాళ్లు సమర్పించనున్నారు.

భక్తి శ్రద్ధలతో భద్రకాళికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



రాహుకాల పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన భద్రకాళి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో నిర్వహించిన రాహుకాల పూజల్లో మహిళలు పాల్గొన్నారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన తరువాత పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయలతో హారాలతో అలంకరించారు. అనంతరం మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం రాహుకాల పూజ విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలు పంచారు. ఈ కార్యక్రమం ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. వీరభద్రుడి దర్శనార్థం పెద్దసంఖ్యలో కన్నడ భక్తులు ఆలయానికి వచ్చారు.